క్లుప్తంగా

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డా.దివ్యచంద్ర, రాంప్రసాద్

కదిరి అర్బన్: పట్టణంలోని రాయచోటి రోడ్డులో ఉన్న చంద్రహాస్ ఆసుపత్రిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బత్తల హరిప్రసాద్ కుటుంబం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు దివ్యచంద్ర, రాంప్రసాద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



యోగానందరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: రాళ్లనంతపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత యోగానందరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి యోగానందరెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, ఆదిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

నల్లమాడ: కుటాలపల్లి, కుటాలపల్లి తండాలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు 57 నెలల్లో అందిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని తెలియజేయడంతో పాటు ఏవైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరిస్తారని పేర్కొన్నాయి. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరాయి.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం




చికిత్స పొందుతున్న సరళమ్మ

ధర్మవరం అర్బన్ : గుట్టకిందపల్లి సమీపంలోని వంకలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ఓ వృద్ధురాలు యత్నించింది. వివరాలు.. ధర్మవరం యాదవ వీధికి చెందిన సరళమ్మ కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది. వ్యాధి నయం కాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆదివారం వంక నీటిలో పడి ఆత్మహత్యకు యత్నించింది. అక్కడున్న వారు గమనించి ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

నల్లమాడ: ఆర్.రామాపురం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం ఐదో తరగతి, ఇంటర్ మీడియట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష 379 మందికిగాను 332 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుధారాణి తెలిపారు. ఇంటర్‌లో ప్రవేశానికి 396 మందికిగాను 75 మంది గైర్హాజరయ్యారన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత పరికి సాదిక్

కదిరి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో యువతతో ఆత్మీయ సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు పరికి సాదిక్, పట్టణాధ్యక్షుడు జిలాన్, యువనేత అఖిల్ సయ్యద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, నాడు నేడు పథకంతో పాఠశాలల అభివృద్ధి, ఇంగ్లిష్ మీడియం, విద్యాకానుక లాంటి పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. విద్యరంగ సంరక్షణ కోసం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థివిభాగం నాయకులు రాఘువేంద్ర, పవన్, రాజశేఖర్, అమీరుద్దీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సుపరిపాలనకు సలాం

- సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం
- అన్ని ప్రభుత్వ సేవలూ గ్రామస్థాయిలోనే
- పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



అమడగూరు: సచివాలయ, వలంటీర్ వ్యవస్థ రాకతో గ్రామస్వరాజ్యం సాకారమైంది. ప్రభుత్వ సేవలన్నీ స్థానికంగా లభిస్తున్నాయి. మండల కేంద్రం, జిల్లా కేంద్రంలోని కార్యాలయాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండాపోయింది. వ్యయప్రయాసలు తగ్గిపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ స్థానిక పాలనతో సిఫార్సులు లేకుండానే అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు దక్కుతున్నాయి. నిధుల కేటాయింపులో వివక్ష లేకపోవడంతో అభివృద్ధి పనులకు ఢోకా లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో కసముద్రం గ్రామ పంచాయతీ ఎంతో అభివృద్ధి చెందింది. పంచాయతీ పరిధిలోకి చెర్లోపల్లి, కంచరగానిపల్లి, కొత్తూరు గ్రామాలు వస్తాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా మొక్కజొన్న, టమాట, క్యారెట్, కర్బూజ, వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలు సాగు చేస్తున్నారు. స్థానికంగా రైతు భరోసా కేంద్రం ఏర్పాటుతో రైతులకు ఎరువులు, విత్తనాలతో పాటు సాగులో మెలకువలు, సలహాలు, సూచనలు అందుతున్నాయి. ఇక అవసరమున్న ప్రతి చోటా సీసీ రోడ్ల నిర్మాణాలు, డ్రైయినేజీలు చేపట్టారు.

వెల్లివిరిసిన సంక్షేమం

కసముద్రం పంచాయతీ పరిధిలో గడిచిన ఐదేళ్ల కాలంలో అమ్మఒడి, విద్యాదీవెన, రైతు భరోసా, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, పెన్షన్ కానుక, చేయూత, ఆసరా, సున్నా వడ్డీ –ఎస్ హెచ్‌జీ, కోవిడ్ సహాయం కింద 2,717 మందికి రూ.7,61,23,164 లబ్ధి చేకూరింది. ఇవే కాకుండా వసతి దీవెన, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, హౌసింగ్, వైఎస్సార్ బీమా, నేతన్న నేస్తం, చేదోడు, జగనన్న తోడు పథకాల ద్వారా డీబీటీ కింద మరో 295 మంది లబ్ధిదారులు రూ 80,02,833 మేర ప్రయోజనం పొందారు. నాన్ డీబీటీ కింద విద్యాకానుక, విద్యార్థులకు ట్యాబ్‌లు, తోడు రుణాలు, గోరుముద్ద, సంపూర్ణ పోషణ, కంటివెలుగు, ఇంటింటికీ రేషన్ పథకాల ద్వారా మరో 930 మంది రూ 3,56,41,486 నిధులను పొందుతున్నారు. మొత్తంగా గ్రామ పరిధిలో ఇప్పటివరకూ 3,942 మందికి రూ. 11,99,83,483 నిధులు అందాయి.

పారదర్శక పాలన



గత ప్రభుత్వ హయాంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక దరఖాస్తు చేసిన వెంటనే ఇల్లు మంజూరు చేశారు. నిర్మాణం దాదాపుగా పూర్తయింది. బిల్లులు కూడా చెల్లించారు. సంక్షేమ పథకాల గురించి వలంటీర్ ఇంటికి వచ్చి తెలియజేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పారదర్శకమైన పాలన చూడలేదు.

– లక్ష్మీదేవి, కసముద్రం

పింఛన్ కష్టాలు తీరాయి



ఇది వరకు పింఛన్ తీసుకోవాలంటే గంటలు, రోజుల తరబడి ఎదురుచూసేవాళ్లం. సచివాలయ –వలంటీర్ వ్యవస్థ వచ్చాక ఆ బాధలన్నీ తొలగిపోయాయి. వలంటీరే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ డబ్బు ఇచ్చి పోతున్నారు. అది కూడా ఠంచన్‌గా ఒకటో తేదీనే ఇస్తున్నారు. మా ఇంట్లో నాకు వృద్ధాప్య, నా భార్య నాగమ్మకు దీర్ఘకాలిక రోగి కింద మరొక పింఛన్ వస్తున్నాయి.

– వెంకటస్వామి, కొత్తూరు

సిఫార్సులు లేకుండానే పథకాలు



ప్రభుత్వ పథకాల మంజూరులో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు లేవు. ఇది శుభపరిణామం. అర్హత ఉంటే చాలు పథకాలు మంజూరు చేసేస్తున్నాం. కుల, మత, వర్గ, పార్టీ విభేదాల్లేకుండా పథకాలు అందాలన్న ప్రభుత్వ ఆశయాన్ని వందశాతం అమలు చేస్తున్నాం. లంచాల ప్రసక్తే లేదు. వలంటీర్లతో ఇంటి వద్దకే సేవలు అందిస్తున్నాం.

– జాన్‌వెస్లీ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, కసముద్రం సచివాలయం

నేడు అన్ని సచివాలయాల్లో 'స్పందన'

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని కోరారు. ప్రజలు తమ సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

నేడు చిగిచెర్లలో ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల (గరుడంపల్లి) దగ్గర రూ.77.47 కోట్లతో నిర్మించ తలపెట్టిన వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల కన్వీనర్, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

మద్యం విక్రేత అరెస్ట్

తలుపుల : మండలంలోని గంజివారిపల్లిలో బాబయ్య అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుడి ఇంటిలో దాచిన 19 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రవికాంత్ తెలిపారు.

సావిత్రీబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలి



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీసీ సంఘం నాయకులు

అమడగూరు: సమాజ సేవకురాలు సావిత్రీబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం గుండువారిపల్లి సమీపంలో ఉన్న కేజీబీవీలో సావిత్రీబాయి పూలే వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ గతంలో సామాన్యుల భవిష్యత్తు కోసం ఎన్నో ఉద్యమాలను చేపట్టిన సావిత్రీబాయి పూలే అడుగుజాడల్లో మనమంతా నడవాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలకు చదువు ఇంటికి ఎంతో అవసరమని చాటి చెప్పారన్నారు. అలాగే వెనకబడిన వర్గాల వారికి చదువును అందించడంలో పూలే ముఖ్య పాత్ర వహించారన్నారు. అలాంటి సేవామూర్తికి భారతరత్న ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, గురుస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

14న ఖాద్రీ ఆలయంలో బహిరంగ వేలం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం(ఏడాది పాటు) ఈనెల 14న ఈ–టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు ఈఓ వి.శ్రీనివాస రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ధరవాత్తు రూ.30 లక్షలు చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. ఆలయంలో తూర్పు రాజగోపురం ముందు భాగమున షాపు నెం.1(ధరావత్తు రూ.5 లక్షలు), షాపు నెం.2(ఉట్టిలో) (ధరావత్తు రూ.3 లక్షలు)లో టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకొను హక్కు కోసం వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్ రుసుం వసూలు(ధరావత్తు రూ.3 లక్షలు) హక్కు, పడమర రాజగోపురం ముందు భాగంలో ప్రహరీకి 6 అడుగుల దూరంలో బండిమీద టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకునే హక్కు(ధరావత్తు రూ.లక్ష) కోసం వేలం ఉంటుందని తెలిపారు. ఆలయం వెనుక భాగానా టీటీడీ కల్యాణ మండపంలో భక్తుల పాదరక్షలు భద్రపర్చుకునే హక్కు(ధరావత్తు రూ.50 వేలు) కోసం వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్వామివార్ల ఉత్సవాలకు పూలు, తోమాలలు, గుండుమాలలు, స్వామి అభిషేకాలకు పాలు, పెరుగు, అన్నదానానికి విస్తరాకుల సరఫరా హక్కు(ధరావత్తు రూ.10 వేలు) కోసం వేలం నిర్వహిస్తామని వివరించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నల్లచెరువు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేద్దామని జెడ్పీటీసీ బసిరెడ్డి అనిత, బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బట్టీ హైదర్‌వలి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి టీవీ ద్వారా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం సభను వీక్షించారు. అనంతరం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ కదిరిలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు శక్తి వంచన లేకుండా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. మండలంలోని ప్రతి గడపకూ వెళ్లి జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలను మరోసారి ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు సంఘం మండలాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, కల్లిపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

ఎన్పీకుంట: మహాశివరాత్రి సందర్భంగా తిమ్మమ్మ మర్రిమాను వద్ద జాగరణ మహోత్సవం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం లెక్కించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి హుండీలు, పార్కింగ్, దర్శన టోకెన్ల ద్వారా రూ.3.04 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అలాగే ఉత్సవ నిర్వహణ కోసం రూ.3.62 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. స్థానిక సర్పంచ్ విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు నారాయణస్వామి, శ్రీనివాసులు, వెంకటనారాయణ, మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ధర్మవరం: పాతికేళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఒక్కచోట చేరారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ అపూర్వ సమ్మేళనానికి తెరతీశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998–99 పదో తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు రవి, కాశీఫ్, గోపి, రాఘువేంద్ర, రాజశేఖర్, మల్లన్న, బండ జనార్ధన్, జయకృష్ణ, కొండన్న, అప్పిరెడ్డిగారి సురేష్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాతికేళ్ల నాటి తమ స్నేహితులను కలిపారు. వారు కలవడమే కాకుండా అలనాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు నాగప్రసన్న, పోలయ్య, లక్ష్మిదేవి, శ్రీదేవి, మేరి, సుధాకర్‌గౌడ్, నారాయణస్వామి, వెంగముని, వెంకటేష్, నాగేష్, శ్రీనివాసులు, చెన్నారెడ్డి, రంగయ్య, గిరి, కొండయ్య, వెంకటస్వామి, అశ్వర్థనారాయణ, సబీరాకానుమ్, రామలింగయ్యలను ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా ట్రస్ట్‌గా ఏర్పడి ఇబ్బందుల్లో తమ స్నేహితులను ఆదుకోవాలని నిర్ణయించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని 3వ వార్డులో ఆయన పర్యటించారు. కౌన్సిలర్ బండారు మురళి శివమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు అంజనేయులు ఆధ్వర్యంలో వార్డు ప్రజలు మక్బూల్ అహ్మద్‌కు గజమాలలు, పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ తిరిగి 57 నెలల్లో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ప్రజల గుమ్మం వద్దే అందిస్తున్నాన్నారు.సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట కట్టుబడి కరోనా సమయంలో కూడా పథకాలను అందించారని గుర్తు చేశారు. గతంలో పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. జగనన్న పాలనలో తెల్లవారు జామున వలంటీర్ ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్లు అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త ఎస్ ఎండీ ఇస్మాయిల్, వజ్ర భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పరికి సాధిక్‌బాషా , సాదత్ అలీఖాన్, వేముల ఫయాజ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

తనకల్లు: కనసానివారిపల్లి, ఉస్తినిపల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ సమక్షంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఎస్ మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయన్నారు. సీఎం వైఎస్ జగన్ పథకాలు నచ్చి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు టీడీపీ కార్యకర్తలు కుమార్, శ్రీనాథ్‌రెడ్డి, మహదేవారెడ్డి, లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి, వెంకటరమణ, భాస్కర్, ముస్తాఫా, శివ, సుధాకర్ తదితరులు తెలిపారు. నాయకులు కమ్మిరెడ్డి, గంగిరెడ్డి, రమణారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్, రవీంద్రారెడ్డి, నాగార్జున, యశ్వంత్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

వ్యాపారి ఇంట్లో చోరీ

తనకల్లు: స్థానిక మెయిన్‌రోడ్డులో నివాసముంటున్న వ్యాపారి ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... మెయిన్‌రోడ్డులోని ఇంట్లో నివాసముంటున్న రత్నమయ్య శెట్టి ఇంట్లోనే కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బెంగళూరులోని కుమారుడి దగ్గరకు వెళ్లాడు. ఇంటి తలుపులను పగలగొట్టి లోనికి ప్రవేశించిన ఆగంతకులు బీరువాలోని 3 తులాలు బంగారంతో పాటు రూ. 20 వేలు నగదును ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ధరణిబాబు తెలిపారు.

వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపు



దాతలను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరంతో పేద ప్రజలకు కంటిచూపును అందిస్తున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటిచూపు తగ్గిన వారికి బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరం దాతలుగా నారాయణమ్మ, చిన్న నారాయణల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రామాంజనేయులు, పార్వతమ్మ, అశోక్‌కుమార్, యశోద, మోక్షజ్ఞ వ్యవహరించారు. శిబిరంలో 167 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 112 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. అనంతరం క్యాంపు దాతలతోపాటు వైద్యులను రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. క్లబ్ కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్త, సభ్యులు నరేంద్రరెడ్డి, శివయ్య, సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ల వెంకటేషులు, కృష్ణమూర్తి, పెరుమాలదాస్, మనోహర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాన కచేరీ



ఘంటసాల పాటలు పాడుతున్న గాయకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కళాజ్యోతిలో ఆదివారం రాత్రి ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన గాన కచేరీ ఆకట్టుకుంది. కళాజ్యోతి అధ్యక్షుడు కుంటిమల నారాయణ, కార్యదర్శి బాలకొండ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌అండ్‌బీ ఏఈ సంజీవయ్య హాజరయ్యారు. అనంతరం ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయకులు కాకినాడ రమణ, గుంతకల్లు వరలక్ష్మి, అనంతపురం జ్యోతి ఘంటసాల పాటలతో అలరించారు.

శ్రీజ్యోతి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



అర్జున్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న సీఈఓ హరిచరణ్

బత్తలపల్లి: విజయవాడలో ఆదివారం నిర్వహించిన గణితం అబాకస్, వేదిక్ రాష్ట్రస్థాయి పోటీలలో బత్తలపల్లికి చెందిన శ్రీజ్యోతి హైస్కూల్ విద్యార్థులు అర్జున్, తీర్థి ప్రతిభ చాటారు. విశ్వం టెక్ ఎడ్యుకేషన్ స్కూల్‌లో విద్యార్థులకు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. సీనియర్ అబాకస్ లెవల్–1 విభాగంలో అర్జున్, జూనియర్స్ వేదిక్ విభాగంలో తీర్థి తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విశ్వం టెక్ ఎడ్యుకేషన్ సీఈఓ హరిచరణ్ వారికి బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులతోపాటు, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు రమేష్‌యాదవ్‌ను పాఠశాల హెచ్‌ఎం మిడతల లక్ష్మీనారాయణ అభినందించారు.

నేడు గాండ్లపెంటలో వైఎస్సార్‌సీపీ ప్రచారం

గాండ్లపెంట: మండల కేంద్రంలో సోమవారం ఉదయం 6.30 గంటలకు స్థానిక గంగమ్మ ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ప్రచారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

తనకల్లు: ఉప్పువాండ్లపల్లికి చెందిన శంకర్‌నాయక్ (45) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కదిరి వైఎస్సార్ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ సర్పంచ్ నాగేంద్రబాబు, రామమోహన్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి ద్వారా ఆదివారం మృతుడి కుటుంబానికి రూ.10 వేలు అందించారు. అలాగే అదే గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న గంగులమ్మకు మరో రూ. 10 వేలు అందజేశారు. నాయకులు శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడిమర్రి: స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి బండారు దేవమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పాలు, పుష్ప మాలలతో అందంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220727, 9912220726, 9010593486